# సామగానం

రామనాథం పార్కులోకి వెళ్ళి, ఒక బెంచిమీద కూర్చున్నాడు. అతనికి జీవితం అంతా నిరాశ కమ్ముకున్నట్లయింది. నలభయి సంవత్సరాలు గడిచిపోయాయి. ఇంతవరకూ సాధించింది యేమీలేదు. కాకపోతే యేరోజు కారోజు ఎలా గడుస్తుందో, ఏ వుపద్రవం వచ్చిపడుతుందో అని భయం కూడాను. గడియారం వంక చూసుకున్నాడు. పావుతక్కువ అయిదు. జేబురుమాలు తీసి ఒకమారు ముఖం అంతా తుడుచుకున్నాడు. కళ్ళజోడు తీసి దాని అద్దాలుకూడా తుడిచాడు. కళ్ళజోడు అద్దాలు తుడిచినప్పుడల్లా ప్రపంచం కాస్సేపు కొత్తగా కనిపించడం అలవాటయిపోయింది. తుడిచిన అద్దాలు ధరించాక, ముందు బెంచిమీద ఎవరు కూర్చున్నారు అని చూశాడు. ఎవరో ఒకామె - మధ్యవయస్సు వుంటుంది - తాపీగా కూర్చుంది. అతను ఆమెవంక చూసినప్పుడు - ఆమె చేతిగడియారం వంక చూసుకుంటూంది. ఆ తరవాత ఆమె ముఖం పైకి ఎత్తింది. అప్పుడు ఆమెను తాపీగా చూచాడు రామనాథం. ముఖం ముచ్చటగా తీరుగా వుంది, సందేహంలేదు. వయసు-? ఆడవాళ్ళ వయస్సు ఎలా అంచనావేయడం? ముప్పది సంవత్సరాలనుంచీ యాభై యేళ్ళలోపు ఎంతయినా కావచ్చును. ఇతమిత్థం అని తేల్చి చెప్పగలగడం ఆ బ్రహ్మదేవుడికి కూడా సాధ్యంకాదు.

ఆమెకూడా రామనాథాన్ని పరికించి చూసింది. అతను సన్నగా పొడుగ్గా లీవిగా వున్నాడు. ముఖంలో హుందాతనం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది - అనుకుంది. సాయంత్రం పూట హాయిగా షికారు వచ్చినట్లున్నాడు. అయితే భార్యను ఎందుకు తీసుకురాలేదో! చాలామంది యింతే. సాయంత్రం ఆఫీసునుంచి రావడంతోటే పెళ్ళాం యిచ్చే కాఫీయో, ఓవల్టీనో గుట్టుచప్పుడు కాకుండా తాగేసి తాము వొక్కళ్లే బయలుదేరతారు షికారుకు. అదేమంటే ఆడవాళ్ళకు యింటిపనులతో తెమలదు. పిల్లల

సవరింపుతో తీరుబడికాదు అని సాకులు చెబుతారు. నిజానికి షికారుకు రమ్మంటే-రామనే ఆడవాళ్ళువుంటారా ?-ఆమె ఇదే విషయం ఆలోచించు కుంటూ తనలో తాను విస్తుపోతుంది. ఎందుకు తనకు అతన్నిగురించి ఆలోచనలు ? అతనుకూడా తనను గురించి యిలాగే యేదేనా అపసవ్యంగా ఆలోచించుకుంటే? తను మాత్రం యెన్నాళ్లనుంచీ యిలా రికామాగా పార్కుకు వచ్చి కూర్చోవాలని ఆలోచన చేసిచేసి-చివరకు ఈ రోజు తీరుబడి చేసుకుంది ? ఏమిటో యితరులను గురించి ఆలోచించుకోవడం తేలిక. అలా ఆలోచించుకున్నది, నిజమో అబద్ధమో తెలిసే అవకాశం లేదుగనుక మరింత హాయిగా వుంటుంది.

పార్కులో పావురాలు ఎగురుతున్నాయి. చాలా విచ్చలవిడిగా ఆడుకుంటున్నాయి. నేలబారుగానే ఎగురుతున్నాయి. ఒక్కొక్కప్పుడు వాళ్ళ పాదాలదగ్గర వచ్చి పడుతున్నాయి. పావురాలు చూడటానికి ఎంత అందంగా వుంటాయి! శాంతికి-సందేశానికి చిహ్నం ఈ పావురాలు.

ఇద్దరికీమధ్య సిమెంటు రోడ్డు, అయిదడుగుల వెడల్పు రోడ్డు. ఎవరో యిద్దరు కాలేజీకుర్రాళ్ళు ఆ రోడ్డంటే కబుర్లు చెప్పుకుంటూ వెళుతున్నారు. ఒకడి మెడతో ట్రాన్సిస్టర్ వేలాడుతోంది. దాంట్లోంచి సినిమా సంగీతం హుషారుగా-అతి నిదానంగా, ఎక్కువ గందరగోళం లేకుండా వస్తోంది. వాళ్ళు బహుశ సినిమా సంగతులే చెప్పుకుంటూవుంటారు. రెండో కుర్రాడు చేతిలో పేపరు ఊపుకుంటూ నడుస్తున్నాడు. వాళ్లునడుస్తూవుండగా, ఒక పావురం వాళ్లకాళ్ళకు అడ్డంపడింది. ఆ కుర్రాడు చేతిలో పేపరుతోదాన్ని ఒక్కటి వేశాడు. పాపం, పావురం గిలగిలలాడుతూ రామనాథం కూర్చున్న బెంచీ కిందికివచ్చి పడింది. ఆ కుర్రాళ్ళు దాని ధ్యాసే లేకుండా సినిమా సంగీతం వింటూ—కబుర్లు చెప్పుకుంటూ ముందుకు నడిచిపోయారు. రామనాథం అప్రయత్నంగా "కర్కోటకులు" అన్నాడు. పావురాన్ని రెండు

చేతుల్తో ఎత్తి బెంచీమీదకి చేర్చాడు. కాస్త "ఫస్టుఎయిడ్" చేశాడు. అయిదారు నిమిషాల్లో పావురం కోలుకుంది, హాయిగా ఎగిరిపోగలిగింది. రామనాథం మనస్ఫూర్తిగా నిట్టూర్చగలిగాడు. అతను ఎస్. పి. సి. ఏ. లో మెంబరు, జంతువులకు—అందులోనూ పావురంలాంటి చిహ్నాలకు ఏమాత్రం అన్యాయం జరిగినా అతని హృదయం ముక్కలయిపోతుంది. తను చేయగలిగినంతా చేస్తేగాని ఆ ముక్కలు మళ్లీ అతుక్కోవు. పావురం ఎగిరిపోయినాక తృప్తిగా ఊపిరిపీల్చి ఎదురు బెంచీవేపు చూశాడు. ఆమె తననే గమనిస్తూ వున్నట్లుంది ఇంతసేపూ. ఆమె కళ్ళు కృతజ్ఞతతో నిండి వున్నాయి. ఆ కళ్ళల్లోకి అప్రయత్నంగా చూసి, తాను ఆమెకే యేదయినా ఉపకారం చేశానా అనుకున్నాడు రామనాథం. ఆమె అట్లాచూస్తూ ఊరుకోలేకపోయింది. అతను తనవంక చూడడంతో "మీకు చాలా పుణ్యం వస్తుంది" అంది.

'నాకు పుణ్యం అక్కర్లేదు. నాకు చేతనయిన పని చేశాను, ఆ తృప్తి చాలు.'

'మీరే సమయానికి ఆదుకోకపోతే అ పావురం ఈ పాటికి పరలోకానికి చేరుకునేది. ఈ కాలం కుర్రాళ్ళకు బొత్తిగా దయ, దాక్షిణ్యం లేదు' అంది ఆమె.

'అంతా రోజుల మహిమ.'

'పావురానికి ప్రాణం పోశారు. ఆ పని నాకు చేతకాదు. నాకే ప్రాణం పోశారనుకుంటున్నాను. నిజం!' అంది ఆమె. అతను నమ్మటం లేదేమోనని భయపడుతూనే.

'ప్రాణం తియ్యటమే తమ హక్కని యిప్పటి కుర్రాళ్ళ ఉద్దేశ్యం' అంటూ అతను చేతిగొడుగు తీసుకుని పైకి లేచాడు, బహుశ యింక ఇంటికి వెళ్ళిపోదామనేమో !

ఆమె గడియారం వంక చూసుకుంది.

'ఒక్క క్షణం కూచోండి' అంది.

అప్పటికి రామనాథం రోడ్డు మధ్యకు వచ్చాడు. ఇంకా ముందుకు నడిచి ఆమె కూర్చున్న బెంచిమీదనే అవతలిపక్కగా కూర్చున్నాడు.

'మీరు రోజూ పార్కుకు వస్తారా?' అంది ఆమె.

'అప్పుడప్పుడూ వస్తుంటాను. ఎప్పుడేనా మనసు బాగా లేనప్పుడు.'

'మీకు వివాహం అయిందా? క్షమించండి - పొరపాటేమో. నేనడగడం' అందామె - నిజంగానే ముఖంలో విచారం పులుముకుని.

'పొరపాటేం లేదు. వివాహం అయింది, పిల్లలేరు. ఉద్యోగం ఒకటే నా ప్రాణం తీస్తోంది, ఎప్పుడూ ఒక్కటే పని. బుర్ర ఖరాబయిపోతుంది. అందుకని అప్పుడప్పుడూ యిక్కడికి వస్తాను.'

'మీ యిల్లు యిక్కడికి దగ్గరా?'

'దగ్గర కాదు, దూరం కాదు. రెండుమైళ్ళు-అంతే. ఇంతకూ మీరు, మీరేం చెప్పలేదు మిమ్మల్ని గురించి-'

'క్షమించండి. నా పేరు పంకజం. మా ఇల్లు యిక్కడికి యాభయి గజాల దూరంలో వుంది. నే నెప్పుడూ ఈ పార్కుకు రాలేదు. ఇదే మొదటి సారి. మీ పరిచయం అయింది. సంతోషం.'

'నా పేరు రామనాథం.'

'మీ చేతి గొడుగు చాల అందంగా వుంది.'

'నా స్నేహితులు బహుమతిగా యిచ్చారు పదేళ్ళ క్రితం. చలిగాలి ప్రారంభం అయింది. ఇంక వెడదాం. వాన వచ్చినా రావచ్చును.'

'అలాగే' అంటూ ఆమె లేచింది.

రామనాథం అనుసరించాడు. ఇద్దరూ ఒకరివేపు ఒకరు ఆసక్తిగా చూసుకొన్నారు. రామనాథానికి యింకా ఆమె కళ్ళల్లో కృతజ్ఞత కనిపిస్తోనే వుంది.

'మీరు అర్జంటుగా ఇంటికి వెళ్ళాలా?'

'అంత తొందరేం లేదు. యేం?'

'మా ఇల్లు దగ్గరలోనే అని చెప్పా కదూ, కాస్త 'టీ' తాగి వెడుదురు గాని.'

'మరోసారి వస్తాలెండి. ఎందుకు మీకు శ్రమ?'

'శ్రమేం లేదు. వారికోసం ఎప్పుడూ 'టీ' మరుగుతూనే వుంటుంది!'

'మీవారు ఇంట్లోనే వుంటారా? నాకు పరిచయం చేయండి.'

'క్లబ్ నుంచి యింకా ఇంటికి వచ్చివుండరు. ఏమో చెప్పలేం.'

ఇలా నడుస్తూ వుండగా ఆ ఇల్లు రానేవచ్చింది.

'ఇదే ఇల్లు. రండి' అంటూ ఆమె గేటుమీద చేయి వేసింది. పక్కన పని చూసుకుంటున్న తోటమాలి పరుగున వచ్చి గేటు సాంతం తెరిచాడు. ఇద్దరూ లోనికి వెళ్ళారు. మధ్యరకం బంగళా. లేత నీలం రంగు. ముందు మంచితోట. తోటలో రకరకాల పూలు. రామనాథం ఆనందంగా చూసుకుంటూ ముందు గదిలోకి చేరుకున్నాడు. ఆమె సోఫా చూపించింది. లోపలకు వెళ్ళింది.

రామనాథం గోడలమీది బొమ్మలు చూస్తున్నాడు.

ప్రకృతి దృశ్యాలు తన జీవితంలో ఊహలక్కూడా అందనంత అందమయిన బొమ్మలు. తన ప్రాణానికి ఇదే ఇంద్రలోకం, చంద్రలోకం.

ఆమె తిరిగి వచ్చింది. ఎదురుగా సోఫాలో కూర్చుంది.

'మీరు పార్కుకు వచ్చినప్పుడల్లా మా ఇంటికి రండి. నేనెప్పుడూ ఇంట్లోనే వుంటాను వారు—మీరు యివాళ పావురాన్ని రక్షించిన కథ వింటే చాలా సంతోషిస్తారు..'

రామనాథం యేమీ మాట్లాడలేదు.

ట్రేలో రెండు కప్పుల 'టీ' తెచ్చింది నౌకరుపిల్ల.

ఆమె ఓ కప్పు స్వయంగా అతనికి అందించింది.

'థాంక్స్!' అంటూ తీసుకున్నాడు.

టీ కప్పు ఖాళీ చేసి బల్లమీద పెడుతూ 'మీకు పిల్లలా?' అనడిగాడు. ఎందుకలా అడగాలనిపించిందో అతనికే తెలియదు.

'లేరు' అంది. ఆమె ముఖంలోకి చూడలేకపోయినాడు.

'లేరని విచారమా? అన్నాడు—తనకు యేమాత్రం విచారం లేదని తెలియచెప్పటానికి అన్నట్లుగా.

'జీవితంలో ఏదో ఒక కొరత వుంటూనే వుంటుంది!' తరువాత కాస్సేపు నిశ్శబ్దం.

ఇద్దరికీ ఏమి మాట్లాడాలని అనిపించడం లేదు.

'వస్తాను, సెలవు' అంటూ లేచాడు, గర్వంగా చేతిగొడుగు ఊపుకుంటూ.

'తప్పకుండా మళ్ళీ రండి. పార్కుకు రావడం నాకు కుదరదు. మరచిపోకండి!' అంది ఆమె గేటుదాకా సాగనంపుతూ.

పంకజం తన గదిలోకి వెళ్ళిపోయింది. పక్కగదిలోనుంచి నవ్వులూ, కేరింతాలూ వినిపిస్తూనే వున్నాయి. ఆయన మళ్ళీ ఎవరినో తెచ్చుకున్నారన్న మాట. పంకజం దుస్తులు మార్చుకుంటూ అద్దంలో చూసుకుంది. అద్దంలో యేం భయంకర దృశ్యం కనిపించిందోగాని ఎక్కువసేపు అక్కడ నించోలేకపోయింది. పక్కమీదికి వొరిగి, కొద్దిసేపు విశ్రాంతి తీసుకుందుకు ప్రయత్నించింది

రామనాథం మెల్లిగా రోడ్డువెంట నడిచి ఇంటికి చేరుకున్నాడు దుస్తులు మార్చుకుని పడక గదిలోకి వెళ్ళాడు. భార్య మంచంమీద పడుకుని వుంది. అతని వంక ప్రశ్నార్థకంగా చూసింది.

'ఏదో ఆడగాలి తగిలినట్లుంది, అయ్యగారికి' అంది—ముఖంలో అసహ్యం, అసహనం రుద్దుకుంటూ.

రామనాథం యేమీ మాట్లాడలేదు.

'ఇంతసేపు ఎక్కటికి వెళ్ళారు' అంది ఆమె మళ్ళీ.

'పార్కుకు వెళ్ళి మంచిగాలి పీల్చి వచ్చాను' అన్నాడు రామనాథం, కిటికీ రెక్కలు తెరుస్తూ.

బల్ల ముందు కూర్చుంటూ "నీ మాత్రలు వేసుకున్నావా, యివ్వ మంటావా ?" అనడిగాడు.

'ఇప్పుడిక మీకు ఓపిక లేదు. మాత్రలు యిచ్చి నన్ను నిద్ర పుచ్చేసి నిశ్చింతగా పడుకుందాం అనుకుంటున్నారు' అంది ఆమె చాలా కటువుగా.

రామనాథం నిశ్శబ్దంగా ఆమెకు రెండు మాత్రలు అందించి, నీళ్ల గ్లాసు పక్కన పెట్టాడు. ఈ క్షణంలో యేం మాట్లాడినా విరసం అవుతుందని అతనికి బాగా తెలుసు. ఆమె మాత్రలు మింగేసి గుటగుట నీళ్లుతాగి దిండుమీదికి చేరగిలబడింది. ఇంతవరకు అదృష్టవంతుడిని-అనుకున్నాడు అతను.

"యేమిటి ఆలోచిస్తున్నారు. యింకా పార్కులో సంగతులే గుర్తుకు వస్తున్నాయా ?"

"నీ ఆరోగ్యం బాగావుంటే నిన్నుకూడా పార్కుకు తీసుకువెళ్ళే వాడినిగదా అనుకుంటున్నాను" అన్నాడు. జీవితంలో తనుఉన్న పరిస్థితుల్లో ఇంతకంటే ఎక్కువ మోతాదులో అతనెన్నడూ మాట్లాడి ఎరగడు, పాపం. *

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)